డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత విశేషాల ఛాయా చిత్ర ప్రదర్శన

విశాలాంధ్ర - కాకినాడ : భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత విశేషాలను తెలుపుతూ సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఛాయా చిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ డా కృతికాశుక్లా ప్రారంభించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శనీయుడని కలెక్టర్ పేర్కొన్నారు. సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ జీవిత చరిత్రపై మున్సిపల్ కార్పొరేషన్ కాకినాడ, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖల అధికారులు సంయుక్తంగా గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అంబేద్కర్ జీవితంపై ఏర్పాటు చేసిన ఈ ఛాయా చిత్రాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. అంబేద్కర్ జననం, బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, రాజ్యాంగ రచన, వివిధ ఘట్టాలకు సంబంధించిన ఛాయాచిత్ర ప్రదర్శనను కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీత, శాసనమండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ, కుడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, జడ్పి సీఈవో ఎ వెంకట రమణారెడ్డి, ఇన్చార్జి డీఆర్వో, డీఆర్డీఏ పీడీ కె శ్రీరమణి, డీపీవో కె. భారతి సౌజన్య, జిల్లా విద్యాశాఖ ఆర్జేడీ, డీఈవో జీ.నాగమణి ఇతర జిల్లా స్థాయి అధికారులు తిలకించారు.

శ్రీచైతన్యలో సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర-దేవరపల్లి : దేవరపల్లి శ్రీ చైతన్య స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కిషోర్ ఆధ్వర్యంలో విద్యార్థులు నూతన దుస్తులు ధరించి సంక్రాంతి వేడుకలు పాల్గొన్నారు విద్యార్థులు విచిత్ర వేషధారణలు గొబ్బెమ్మలు హరిదాసులు వేషాలతో శ్రీహరి వేషధారణలతో వేడుకల్లో పాల్గొన్నారు పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ముగ్గులు పోటీల నిర్వహించారు ఈ సందర్భంగా విజేతలకు ప్రిన్సిపాల్ కిషోర్ బహుమతి ప్రధానం చేశారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కిషోర్ మాట్లాడుతూ సాంస్కృతి సాంప్రదాయాలకు పండుగలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రతి సంవత్సరం పాఠశాల ఆవరణలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు విద్యార్థులలో దాగివున్న తెలివితేటలను వెతికి తీయటానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయి అన్నారు . ఈ కార్యక్రమంలో ఏజీఎం పార్థసారధి, ఆర్ఐ ఉదయ భాస్కర్, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహృదయ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయం

విశాలాంధ్ర - పి గన్నవరం : సహృదయ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పి గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి, పి గన్నవరం గ్రామ సర్పంచ్ బొండాడ నాగమణి అన్నారు. పి గన్నవరం లోని సహృదయ ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఏకం యూఎస్ఏ వారి ఆర్థిక సహాయంతో సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక దివ్యాంగునికి ట్రై సైకిల్‌ను, ముగ్గురు వితంతువులకు కుట్టు మిషన్లను, స్థానిక పారిశుధ్య కార్మికులకు దుప్పట్లను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా సహృదయ ఫౌండేషన్ తరపున ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పైడి రాజేష్, సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు ద్వారా తెలుగు రాష్ట్రాలలో ఆపదలో ఉన్నవారికి సహాయపడ్డారన్నారు. వారి సేవలను ఈ సందర్భంగా ఎస్ఐ హైకోర్టు శాస్త్రి, సర్పంచ్ బొండాడ నాగమణి కొనియాడారు. ఈ కార్యక్రమంలో సహృదయ ఫౌండేషన్ సభ్యులు దిరుసుమర్తి సతీష్, యర్రంశెట్టి భాస్కర్, యర్రంశెట్టి సురేష్, బండారు సాయి, పైడి సురేష్, గాడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర - ఆలమూరు : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విశ్వసనీయ సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసి ఆలమూరు మండలంలోని జొన్నాడ సెంటర్ వద్ద పట్టుకుని స్థానిక పోలీస్ వారికీ అప్పగించారు. ఎస్సై శ్రీను నాయక్ తెలిపిన వివరాలు మేరకు ఏలూరు జిల్లా వాసి కడలి లక్ష్మణ్ అనే వ్యక్తి రాజానగరంలోని కోళ్ల ఫారాలకు అక్రమంగా అశోక్ లైలాండ్ వాహనంపై రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఆ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 2టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు చెప్పారు. ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

అగ్నిప్రమాద బాధితులను అన్ని విధాల ఆదుకుంటాం

విశాలాంధ్ర - జగ్గంపేట : అగ్నిప్రమాద బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గ సమన్వయకర్త తోట నరసింహం అన్నారు. జగ్గంపేట మండలం రామవరం రంగవల్లి నగర్‌లో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించి 7 గుడిసెలు కాలి బూడిదయ్యాయి. గురువారం ఆయన వైసిపి శ్రేణులతో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి భాదితులను పరామర్శించారు. బాధితులకు ఒక్కొక్కరికి 10 వేలు రూపాయలు నగదు, నిత్యావసర సరుకులు, దుస్తులు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ ప్రమాదం జరిగి సర్వం కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. తక్షణ సహాయంగా పార్టీ నాయకుల సహకారంతో అందించడం జరిగిందన్నారు. అధికారులతో మాట్లాడటం జరిగిందని, ప్రభుత్వ పరంగా బాధితులను ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్తులూరి నాగబాబు, వైసిపి నాయకులు ఒమ్మి రఘురామ్, అత్తులూరి సాయిబాబు, గుర్రం మహాలక్ష్మి, ఎస్. ఏ గఫూర్, తదితర పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - రాజోలు : మల్కిపురం ఎంవిఎస్ జెఎస్ అండ్ ఆర్‌విఆర్ డిగ్రీ కళాశాల 1986- 89 బిఏ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం అంతర్వేది యాపిల్ రిసార్ట్స్‌లో ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగింది. దేశంలోని నలుమూలల నుండి ఈ డిగ్రీ బ్యాచ్ విద్యార్థులు హాజరయ్యారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఉల్లాస భరితంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బీచ్ లో కేక్ కట్ చేసుకుని సరదాగా గడిపారు. కొంతమంది కుటుంబాలతో సహా హాజరై తమ కష్టసుఖాలను పంచుకున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఆత్మీయ సమ్మేళనాలను జరపాలని అభిలాషించారు. ఈ సమ్మేళనం సందర్భంగా విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు, ఆటంకం కలగకుండా ఉండేందుకు వకులశ్రీ భర్త సోమశేఖర్ దాతృత్వంతో ముగ్గురు విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ బాజ్జి, దేవ రాజేంద్రప్రసాద్, రాపాక పెద్దిరాజు, యాలంగి రమేష్, నీలయబాబు, భాను, పిల్లి ప్రకాష్, సుశీల, వనిత, సత్య, శాంతకుమారి, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలకు అనుమతులు లేవు

విశాలాంధ్ర - రాజానగరం: హైకోర్ట్ ఉత్తర్వుల మేరకు సంక్రాంతి సంబరాల్లో ఎటువంటి కోడిపందాలకు ,నిషిద్ధ క్రీడలకు అనుమతులు లేవని రాజానగరం పోలీసు స్టేషన్ సిఐ పి.కాశీ విశ్వనాథం అన్నారు. రాజానగరం స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఈమేరకు గురువారం దండోర వేయించారు.అలాగే విశాలాంధ్రతో చరవాణిలో మాట్లాడుతూ కోడిపందాలు, పేకాట, గుండాట,మరియు అశ్లీల నృత్యాలకు ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు.హై కోర్ట్,జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు సుమారు 200 మందిపై బైండోవర్ కేసులు నమోదైనట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

మున్సిపల్ కార్మికులను మోసగిస్తే సమ్మె తప్పదు

విశాలాంధ్ర- రాజమండ్రి: మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలికంగా వాయిదా పడిందని, చర్చలు సానుకూలంగా జరిగినప్పటికీ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తేనే కార్మికులు సంతృప్తిగా ఉంటారని, మినిట్స్ కాపీ వచ్చిన తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని వైసిపి సర్కార్ కార్మికులను మోసం చేస్తే మన సమ్మె తప్పదని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాజమండ్రి కమిటీ గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు అన్నారు. గురువారం స్థానిక రెల్లిపేట వద్ద యూనియన్ విస్తృతస్థాయి సమావేశం రెడ్డి రమణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు మాట్లాడుతూ జరిగిన చర్చల్లో అభ్యంతరాలను డీసెంట్ ఇచ్చామని, ఒప్పుకున్న జీతభత్యాలు జీతం కేసులు ఎత్తివేత ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిశీలనకు కమిటీ క్లాప్ డ్రైవర్ల సమస్యల పరిష్కారంపై రావాల్సి ఉందని అన్నారు. 21 వేల వేతనానికి అదనంగా రెండు మూడు వేలు పెంచాలని, కనీసం ఒక నెల బోనస్ ఇవ్వాలని కోరామన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ముత్యాలు మురళీకృష్ణ, బంగారు నాగేశ్వరరావు, ధనుల దుర్గమ్మ , కిషోర్ ,బంగారు గిరి, కాకి సరదా, ఎం. శివ, గోడం గిరి, భాగ్యలక్ష్మి, ముత్యాల పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలకు ఏర్పాట్లు

చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర - కాట్రేనికోన : కాట్రేనికోన మండలంలో ముందస్తుగా సంక్రాంతి కోడిపందాలు ఏర్పాట్లు చక చకా సాగి పోతున్నాయి. గ్రామాల్లో పందెం నిర్వాహకులు పందెంబరులు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది ప్రధానంగా గెద్దనపల్లి గ్రామంలో కోడిపందాలు నిర్వహించేందుకు వారం రోజులుగా పనులు ప్రారంభించారు. స్థానిక గ్రామ సచివాలయం చెంతనే పందెం బరులు సిద్ధం చేస్తున్నా అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు. మొక్కుబడిగా పోలీసులు వచ్చి వెళ్లిపోయారని స్థానికులు ఆరోపిస్తు న్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు పేరుకే నోటీసులు ఇస్తున్నారని పందాలు నివారణకు చిత్తశుద్ధి లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది గెద్దనపల్లి పందాల్లో కోట్లరూపాయలు చేతులు మారనున్నాయి. భారీ స్థాయిలో అక్రమమద్యం విక్రయానికి ఏర్పాట్లు సాగుతున్నాయి.

విశ్రాంతి ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - నిడదవోలు : విశ్రాంతి విద్యుత్ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని పెన్షనర్ల సంఘ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక పెన్షనర్ల సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షులు అడబాల నరసింహ కొండల రాయుడు అధ్యక్షతన అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెన్షనర్లుకు రావలసిన డి.ఎ. బకాయిలు,పెంచిన జీతాల బకాయిలు,పెండింగ్ డి.ఎ. లు, విద్యుత్ సంస్థ చెల్లించడం లేదని,దాంతో పాటుగా పెన్షన్లు కూడా ఒకటో తేదీన రాకపోవడంతో వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ప్రభుత్వం స్పందించి సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శిగులూరి వెంకట సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లూరి రామమూర్తి, ఉపాధ్యక్షులు పూట్టా సర్వేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పితాని జార్జి , కోశాధికారి గొన్నాబత్తుల రామారావు , ఆఫీస్ కార్యదర్శి అడపా సూర్యచంద్ర రావు , ఇ.సి.మ్.లు, సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : స్వచ్ఛత మన అందరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇన్చార్జి మంత్రి బీసీ సంక్షేమం రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రఫీ శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పులుపునిచ్చారు. గురువారం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ రాజమండ్రి రూరల్ మండంలో ధవలేశ్వరం ప్రభుత్వం జూనియర్ కాలేజ్ గ్రౌండ్ ప్రాంగణంలో వాలంటీర్స్ తో సమావేశం సందర్భంగా విచ్చేసిన సమయంలో అపరిశుభ్రంగా ఉన్న సభా ప్రాంగ ణాన్ని పరిశీలించి స్వయంగా చీపురు తీసుకొని స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత పర్యావరణాన్ని కాపాడుకోవలసిన ఆవశ్యకత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో రూరల్ మండలం ఎంపీడీవో డి. శ్రీనివాస రావు, కడియం ఎంపీడీవో కె. రత్నకుమారి, అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు

విశాలాంధ్ర - అనపర్తి : క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక గుర్తింపు తో పాటు విద్యా, ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం కుతుకులూరు హైస్కూల్లో తాడి మురళీకృష్ణారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఎమ్మెల్యే సత్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, ఉప సర్పంచ్ సబ్బెళ్ళ నాగిరెడ్డి, ఎంపిటిసి సత్తి దొరయ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డస్ట్‌బిన్ల పంపిణీ

విశాలాంధ్ర - అనపర్తి : ఇంటి పరిసరాలను ఏవిధంగా శుభ్రంగా ఉంచుకుంటామో గ్రామాన్ని అంతే పరిశుభ్రంగా చూసుకోవాలని, సంపూర్ణ పారిశుద్ధ్యం అందరి బాధ్యతని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక గ్రామపంచాయతీ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ప్రజలకు డస్ట్ బిన్ ల పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొని భోగిమంట వెలిగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు), పార్టీ అనపర్తి పట్టణ అధ్యక్షులు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణా రెడ్డి, సర్పంచ్ వారా కుమారి, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీ కొండేటి భీమేష్, పంచాయితీ ఈవో మల్లిడి విజయ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

జూదాలు జరగకుండా చూడాలి

విశాలాంధ్ర-పెరవలి.: జూదాలు, కోడిపందాలు జరగకుండా చూడాలని తహసీల్దార్ రాజరాజేశ్వరి అన్నారు. .గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంక్రాంతిని ప్రతీఒక్కరు ఆనందంగా సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. కోడిపందాలు జూదాలు నిర్వహించకుండా గ్రామాలలో ఎప్పటికప్పుడు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో చూడాలని అన్నారు.అజ్జరం పిట్టలవేమవరం గ్రామాల ప్రాంతాలలో ఆమె పలువురు అధికారులు, సర్పంచ్ లతో కలసి పరిశీలించారు.

మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అడుగులు

-ఎనిమిది విడతలో జగనన్న తోడు పథకం ద్వారా 16,901 మందికి రూ.17.88 కోట్ల లబ్ధి

-కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : చిరు వ్యాపారులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడం ద్వారా మహిళా సాధికారత దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకం కింద ఎనిమిది విడతలో చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారికి బ్యాంకుల ద్వారా రూ.10 వేలు చొప్పున వడ్డీలేని రుణాలను బటన్ నొక్కి ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి ఎంపీ వంగా గీత, శాసనమండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, కుడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు, లబ్ధిదారులతో కలిసి వర్చువల్‌గా హాజరయ్యారు. కార్యక్రమంలో జగనన్న తోడు కింద ఇప్పటికే లబ్ధిపొంది విజయవంతంగా చిరువ్యాపారాలు నిర్వహిస్తున్న వివిధ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. ముఖ్యమంత్రి బటన్‌నొక్కి వడ్డీలేని రుణాలను, వడ్డీ రాయితీ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎంపీ, ఎమ్మెల్సీ, కలెక్టర్.. అధికారులతో కలిసి గ్రామీణ, పట్టణ ప్రాంతాల లబ్ధిదారులకు మెగా చెక్‌లు అందజేశారు. మహిళలు ప్రదర్శించిన వస్తు ఉత్పత్తులను పరిశీలించి..స్వయంగా కొనుగోలు చేశారు.

జంగా జాన్సన్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ : ముందు తరాల వారికి స్ఫూర్తి దాయకంగా నిలిచిన జంగా జాన్సన్ ఆదర్శనీయులని వారు జీవించి లేనప్పటికీ వారి పేరున క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించుకోవడం అభినందనీయమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమం రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు సినిమా ఆటోగ్రఫీ శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం రాజమండ్రి రూరల్ మండలం ధవలేశ్వరం బాలుర పాఠశాలలో నిర్వహించిన ఎబీసీసీ ఫెస్టివల్ టోర్నమెంట్ జంగా జాన్సన్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ని జిల్లా ఇంచార్జ్ మంత్రి రాజమండ్రి రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ స్థానిక నాయకులు సతీష్ చంద్ర స్టాలిన్, గిరిజాల బాబు, చిన్ని లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ సంక్రాంతి గ్రామీణ సాంప్రదాయానికి పెద్ద పండుగని, క్రీడలు శారీరక మానసిక ఉల్లాశానికి ఎంతో దోహదపడతాయని, నేడు యువత క్రీడలు పట్ల ఆకర్షితులయ్యేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ప్రవేశపెట్టిం దన్నారు. ప్రతి క్రీడాకారుడు సమాజహితం, సమాజ శ్రేయస్సు కోరుకుంటారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సతీష్ చంద్ర స్టాలిన్, గిరిజాల బాబు, చిన్ని,దొంతం శెట్టి వీరభద్రయ్య, ఈలి గోపాలం, ఎస్. సూరిబాబు, ఎన్.వి.శేఖర్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - చాగల్లు : చాగల్లు గ్రామం నుండి లక్ష్మీపురం వరకు సుమారు 7 కోట్ల 80 లక్షల రూపాయలతో మొట్టమొదటిసారిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బిటి రహదారి నిర్మాణ పనులను చేపడుతున్నది. దీనికి సంబంధించి గురువారం రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ బీటీ రహదారి నిర్మించడం ద్వారా పాటమ్మ పేట వాసుల తరాల కష్టాలు తీరనున్నాయి. గత ప్రభుత్వాలు గ్రామంలో అంతర్గత రహదారులు నిర్మించిన ఈ ప్రధాన రహదారి నిర్మించకపోవడం వలన చినుకు పడితే చిత్తడిగా మారి వర్షాకాలంలో ఈ రహదారి వెంబడి ప్రయాణించాలంటేనే జనం బెంబేలెత్తి పోయేవారు.చాగల్లు గ్రామం నానాటికి వేగంగా విస్తరించడంలో భాగంగా శివారు వృద్ధాశ్రమం వరకు ప్రజలు నివాస గృహాలు నిర్మించుకున్నారు. ఈ కారణంగా నిత్యం ఈ రహదారి వెంబడి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.తరతరాలుగా ఈ రహదారిని నిర్మించాలని డిమాండ్ ఉన్న స్థానిక మంత్రి శ్రీమతి డాక్టర్ తానేటి వనిత ప్రత్యేక చొరవతో పాటమ్మ పేట వాసుల కల సాకారం కాబోతోంది.ఈ నిర్మాణపు పనులను స్థానిక ఎం ఆర్ కన్స్ట్రక్షన్ కంపెనీ చేజిక్కించుకోవడంతో నిర్మాణపు పనులు వేగంగా జరుగుతాయని ప్రజలు ఆశిస్తున్నారు.తమ కష్టాలను తెలుసుకొని నూతన రహదారి నిర్మాణానికి కృషి చేసిన మంత్రి తానేటి వనితకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కాజులూరు : మండల కేంద్రమైన కాజులూరు శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన ఆకుల లక్ష్మణరావు (38) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తూ వుండేవాడు. పని నిమిత్తం కాజులూరులో గ్రామంలో సలాది వారి వీధిలో సలాది రాంబాబు అలియాస్ రాము ఇంట్లో డ్రిల్ మిషన్‌తో పని చేస్తుండగా షార్ట్ సర్క్యూట్ జరగడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారైలు వున్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కాకినాడ జిజిహెచ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రికి కుర్చీల బహూకరణ

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం : స్థానిక ఆనంద నగర్ ప్రభుత్వ హాస్పటల్‌కు వచ్చే రోగులు కూర్చోవ డానికి ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొన్న తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) కార్యవర్గ సభ్యుడు రచయిత మల్లె మొగ్గల గోపాలరావు రూ.10 వేలు విలువచేసే రెండు సిమెంట్ కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అఖిల్ అహ్మద్, తూర్పుగోదావరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్యక్షులు పడాల వీరభద్రరావులు మల్లెమొగ్గల గోపాలరావును అభినందించారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది వెంకట్, రమేష్, గౌతమి, నూతన, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెల కాలం... ఇరకాటంలో ప్రభుత్వం

విశాలాంధ్ర-కొవ్వూరు : చేసిన పాపం వెంటాడుతూనే ఉంటుంది అన్న నానుడికి ప్రభుత్వం నిదర్శనంగా నిలుస్తోంది. దీనికి ఉదాహరణగా కనబడుతోంది ఉద్యోగుల సమ్మె ఉదంతం. ప్రతిపక్షంలో ఉండగా ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిన సీఎం జగన్మోహన్ రెడ్డి నేడు వాటిని అమలు చేయలేక మరోవైపు ఆర్థిక పరిస్థితి బాగోలేక సతమతమవుతున్నారు. ఎన్నికలు సమీపించిన వేళలో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరూ ఇదే సరైన సమయం అని ఉద్యమ బాట పడుతు న్నారు. దీనిలో భాగంగా మొట్టమొదటిగా అంగన్వాడి వర్కర్లు ఆయాలు సమ్మె బాటకు తెర తీశారు. మున్సిపల్ కార్మికులు,108 104 ఉద్యోగులతో పాటు ఇతర ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మె బాటను పట్టారు. పట్టణాలన్నీ మురికి కూపంగా మారడంతో ప్రభుత్వం దిగివచ్చి వారి కోరికలను ఆమోదించింది. అంగన్వాడీలతో పాటు పలు ఉద్యోగ సంఘాలను పక్కనపెట్టి ఎస్మా చట్టాన్ని సైతం ప్రయోగించారు. మరోవైపు రాజకీయంగా పార్టీలో ఉన్న అసంతృప్తి నేతలను బుజ్జగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పరిపాలన గాడి తప్పిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రసాద్ మృతికి పలువురి సంతాపం

విశాలాంధ్ర- గోకవరం: గోకవరం మండలం, గుమ్మళ్లదొడ్డి గ్రామ రెవిన్యూ సహాయకుడిగా సేవలంది స్తున్న కొల్లాటి ప్రసాద్ ఆకస్మిక మృతికి పలువురు రెవెన్యూ ఉద్యోగులు, సహచర రెవెన్యూ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. గోకవరం తహసిల్దార్ శ్రీనివాసరావు, బిక్కవోలు తహసిల్దార్ కంగుల పోసిబాబు తదితరులు మృతదేహాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. గోకవరం తహసీల్దార్ శ్రీనివాసరావు ప్రసాద్ అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. వైకాపా నాయకులు సమ్మెట మోహన్ , గ్రామ సర్పంచ్ శరకణం రామలక్ష్మి, పెనికేటి అచ్చిరాజు, వివిధ గ్రామాలకు చెందిన వీఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది, తదితరులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

షర్మిల రాక కాంగ్రెస్‌కు బలం

విశాలాంధ్ర- దేవరపల్లి : షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరటం వలన కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరి రాబోవు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ చాపల కృష్ణ చైతన్య పేర్కొన్నారు దేవరపల్లిలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోకి షర్మిల రావటం శుభ పరిణామం అన్నారు స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఎంతో ఆకాంక్షించారని గుర్తు చేశారు వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరటం వలన వైయస్ రాజశేఖర్ రెడ్డి కోరిక నెరవేరి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని కృష్ణ చైతన్య ఆశాభావం వ్యక్తం చేశారు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి నాయకత్వంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు సమిష్టి కృషిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని కృష్ణ చైతన్య తెలిపారు.

ఆదర్శ్ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - గొల్లప్రోలు : గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు అట్టహాసంగా జరిగాయి. గురు వారం ఆదర్శ్ కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు, కరస్పాండెంట్ బుర్రా అనురాధ, ప్రిన్సిపాల్ వైవియస్ రాజశేఖర్, విద్యార్థులు ఉపాధ్యాయుల సమక్షంలో భోగి మంటలను వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. భోగిమంట చుట్టూ విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తి శ్రద్ధలతో కోలాటం ఆడుతూ అందరిని ఉత్సాహపరిచారు. విద్యార్థులచే తయారు చేయబడిన సాంప్రదాయ తెలుగు పిండి వంటలను రుచి చూసిన వారందరూ తమ చిన్న నాటి అనుభూతులను నెమరు వేసుకున్నారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన సాంప్రదాయ దుస్తుల ప్రదర్శన చూపరులను కనువిందుగావించారు. కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో గెలుపొందిన వారందరికి కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు బహుమతులను అందజేశారు. కార్యక్రమం ఆద్యంతం, వినోదం, ఆహ్లాదం పంచిన విద్యార్థులు, ఉపాధ్యాయులు భోధ నేతర సిబ్బందికి అభినందనలు, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

సంస్కృతి సాంప్రదాయాలను నిలబెట్టుకోవాలి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నరసన్న నగర్‌లోని మానవీయ వృద్ధుల ఆశ్రమంలో అలయన్స్ క్లబ్ ఆఫ్ స్వాతి హెల్పింగ్ హాండ్స్ వారి ఆధ్వర్యంలో అధ్యక్షుడు అలై కిరణ్ కుమార్ అధ్యక్షతన సతీష్ కుమార్, కుమారిల కుమార్తె ప్రజ్వల జన్మదినం సందర్భంగా వృద్ధులకు చీరలు ఫ్రూట్స్ స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు విశిష్ట అతిథిగా క్లబ్స్ వైస్ గవర్నర్ అలై వనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ చిన్నారి ప్రజ్వల తన తల్లితండ్రులు అలాగే స్కూల్లో ఉపాధ్యాయులు చెప్పిన మాటలను స్ఫూర్తిగా తీసుకుని తన దగ్గర ఉన్న పాకెట్ మనీతో ఏదైనా సేవా కార్యక్రమం చేస్తానని తల్లిదండ్రులకు చెప్పడం జరిగిందని దానికి వారు ఎంతో ఆనందించి తన జన్మదిన సందర్భంగా ఇక్కడ వృద్ధులకు చిన్నారి ప్రజ్వల, నిహారికల చేతులమీదుగా చీరలు పంపిణీ చేసినట్టు తెలిపారు. వైస్ గవర్నర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పెద్దల యందు తల్లిదండ్రుల పట్ల గౌరవంతో మెలగాలని వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఇటువంటి ఆశ్రమాల్లో చేర్చకుండా మన దగ్గరే ఉంచుకుని వారిని ప్రేమగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పిఆర్ఓ అలై బాలాత్రిపుర సుందరి, క్లబ్ కోశాధికారి అలై కొత్త మెహర్ శ్రీరాములు, అలై వనుం ఉపేంద్రనాథ్, అలై దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-వీరవాసరం: మండల కేంద్రమైన వీరవాసరం తోపాటు మండలంలోని పలు గ్రామాల్లో పలు ప్రాంతాల్లో చెరువు, పంచాయతీ పోరంబోకు స్థలాలు, పలు రహదారులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకునేవారు లేరు. రహదారులు, చెరువు స్థలాలు పరాధీన మవుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. వీటిపై

'స్పందన' లో గ్రామస్థులు ఫిర్యాదు చేస్తున్నా అధికారులు ప్రకటనలు, హెచ్చరికలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల అండలూరు గ్రామంలో తాగునీటి చెరువుకు చెందిన స్థలం ఆక్రమణకు గురయ్యింది. గతంలో ఇక్కడి ఆక్రమణలను అధికారులు తొలగించారు.తాజాగా కొందరు ఇక్కడి మురుగు బోదెను సైతం పూడ్చేసి తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో మరికొందరు సమీప స్థలాల ఆక్రమణలకు సన్నాహాలు చేస్తున్నారు. వీటిపై అందిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంతో అక్రమార్కులు మరో అడుగు ముందుకు వేసి ఆయా స్థలాలను క్రయ విక్రయాలు చేస్తున్నారు. తిరిగి మరో ప్రాంతంలో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా. ఆక్రమణదారులకు కనీసం నోటీసులు ఇవ్వడానికి కూడా యంత్రాగం చొరవ తీసుకోవడంలేదు. రెవెన్యూ శాఖ ద్వారా సర్వే చేయించి చర్యలు తీసుకుంటా మంటూ కాలయాపన చేస్తున్నారు. ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలకు విద్యుత్తు సర్వీసులను కూడా ఇవ్వడంతో అక్రమార్కులకు మరింత ఊతమిచ్చినట్లవు తుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు ఆక్రమిత, ఖాళీ స్థలాలను స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

'రా కదలిరా' బహిరంగసభ ఘన విజయం

విశాలాంధ్ర భీమడోలు: వైసిపి నాయకులు చేస్తున్న అక్రమాలు అన్యాయాలతో ప్రజలు విసిగిపోయారని, తెదెపా హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప ఈ ప్రభుత్వంలో ఎక్కడా అభివృద్ధిలేదని ఏలూరు పార్లమెంటు అధ్యక్షులు గన్ని

వీరాంజనేయులు అన్నారు. టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో గన్ని మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్ళు వెనక్కి వెళ్ళిపోయిందన్నారు. ఏపీ ప్రజలకు వైఎస్సార్సీపీ చేస్తున్న అన్యాయాలను, అక్రమాలను ఎత్తిచూపేందుకు చంద్రబాబు నాయుడురా..కదలిరా... ప్రచారకార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. రా కదలిరా బహిరంగ సభల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను ఎత్తిచూపుతు జగన్ రెడ్డి ప్రభుత్వ అవినీతి, అన్యాయాలపై ప్రశ్నల వర్షం కురిపిస్తూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న చంద్రబాబు రా కదలిరా సభలకు వచ్చే జనసంద్రాన్ని చూసి తాడేపల్లి పిల్లిలో వణుకుడు మొదలైంది. తెదేపా తొలివిజయంఅన్నారు.రానున్న ఎన్నికల్లో చంద్రబాబు ఆధ్వర్యంలో తెదేపా విజయ ఢంఖా మోగించడం ఖాయంఅన్నారు. రాబోయేది తెలుగుదేశం జనసేన ప్రభుత్వమేఅన్నారు.ఈ కార్యక్రమంలో శిరిబత్తిన వీరవెంకట సత్యన్నారాయణ, కరణం పెద్దిరాజు, దూసనపూడి పుల్లయ్య నాయుడు, శేషాపు శేషగిరి, యడ్లపల్లి శ్రీరామ కృష్ణ, యడ్ల రమేష్ , ఇతర తెలుగుదేశం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మండలంలో పలువురికి జనసేన ధర్మరాజు పరామర్శ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వానపల్లి సత్యనారాయణ కుమారుడు వానపల్లి బాలాజీ ఇటీవల మరణించారు. ఆయన కుటుంబ సభ్యుల్ని ఉంగుటూరు నియోజకవర్గం జనసేన

పార్టీ ఇన్‌చార్జి ఉత్సమట్ల ధర్మరాజుకలిసి పరామర్శించారు. మండలంలో పలు గ్రామాల్లో పలువురిని పరామర్శించారు. ఆయనతోపాటు తోట శ్రీను,జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు మద్దాల లక్ష్మీ రమేష్,చింటు,సురేష్,సత్తి, ఏసు గంగాధర్, వాసు రాజు, గ్రామ జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

మినీ జాబ్ మేళాకు 89 మంది హాజరు

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో టి.టి.డీ.సి బిల్డింగ్ గురువారం నిర్వహించిన మిని జాబ్ ఫెయిర్ కు 89 యువత హాజరై 28 మంది వివిధ కంపెనీలలో

ఉపాధి పొందినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మినీ జాబ్ ఫెయిర్‌లో హెట్రో డ్రగ్స్, ఇన్నోవసోర్స్, పే.టి.యంల ప్రతి నిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రంలో జిల్లా ఉపాధి కార్యాలయం అధికారి మధు భూషణ్ , యుంగ్ ప్రొఫిషన్ ప్రవీణ్, జిల్లా ప్లేస్మెంట్ అధికారి కైకరపు ప్రవీణ్, స్కిల్ కాలేజ్ కోఆర్డినేటర్ రాజరాజేశ్వరీ, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శ్యామ్, సునీల్ పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు నివాళులు

విశాలాంధ్ర-కైకలూరు: భారత రాజ్యాంగం ద్వారా ప్రజాస్వామ్యానికి భారతదేశంలో పునాది వేసిన ఏకైక వ్యక్తి డా. బి.ఆర్. అంబేద్కర్ అని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు పేర్కొన్నారు. గురువారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన సామాజిక సమత సంకల్ప కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు డా. బి.ఆర్. అంబేద్కర్

విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సామాజిక న్యాయంపై ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో అనేక కార్యక్రమాలు నిర్వహించబడుతున్నా యన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనేత జీవిత చరిత్ర ఆయన సమాజానికి చేసిన సేవలను ప్రతిఒక్కరూ తెలుసుకోవల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా బి.సి. నాయకులు ఘంటా ప్రసాదరావు, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్,ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కె ఖాజవలి,తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య సంబరాల్లో ఉత్తమ కవి పురస్కారం

విశాలాంధ్ర - గణపవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య అకాడమీ వారు సంక్రాంతి సాహిత్య సంబరాలలో భాగంగా గురువారం గణపవరం గ్రామానికి చెందిన డాక్టర్ యండపల్లి పాండురంగాచార్యులు గణపవరం అన్నపూర్ణ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఆయనకు జిల్లా ఉత్తమ కవి పురస్కారంతో

పాటు అయిదు వేల నగదు బహుమతి తో ఏలూరు వై ఎన్ హెచ్ ఏ లో ఘనంగా సన్మానం చేశారు. పాండురంగాచార్యులును ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు(వాసు బాబు), ఎంపీపీ దండు రాము, జడ్పిటిసి సభ్యులు దేవరపు సోమలక్ష్మి, రుద్దరాజు ఫౌండేషన్ చైర్మన్, వర్తక సంఘం అధ్యక్షులు రుద్రరాజు వేంకట సూర్యనారాయణ రాజు (ఆర్ వి ఎస్ రాజు), అక్షర కిరీటి కవి తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి, అన్నపూర్ణ డిగ్రీ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

సంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి

సంక్రాంతి సంబరాలను ప్రారంభించిన కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి పండుగ అని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు.గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ, ఏలూరు జిల్లా ప్రభుత్వం

యంత్రాంగం, హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఎ) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్ఎ హాలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సంక్రాంతి సంబరాల్లో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి , సాంప్రదాయా లకు నిలువుటద్దంగా కుటుంబ సమేతంగా కలిసి చేసుకునే ప్రత్యేకమైన సంక్రాంతి పండుగను నూతన సంవత్సరంలో మొదటి పండుగగా మూడు రోజులపాటు ఆనందోత్సహాలతో జరిగించుకోవడం ఆచారంగా కొనసాగు తుందని తెలిపారు. ఈ సంక్రాంతి పండుగ ద్వారా కుటుంబ వ్యవస్థ బలపడటమే కాకుండా నేటి సమాజంలో యువతకు సంస్కృతి సాంప్రదాయాలపై మక్కువనుకూడా పెంచడానికి దోహదం చేస్తుందని అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి పాల్గొని భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పండుగ ఆనందోత్సాహాలతో ప్రజలందరూ ప్రతి సంవత్సరం జరిపించుకోవడం జరుగుతుందని ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ పండుగ జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలను ఆచరిస్తూ ప్రతి ఒక్కరికి మార్గదర్శకులు అవ్వాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్ పర్సన్ శ్రీలక్ష్మి, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఆర్డిఓ ఎన్.ఎస్.కె. ఖాజావలి, మార్కెట్ యార్డు చైర్మన్ నెరుసు చిరంజీవులు, ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, నగర డిప్యూటీ మేయర్లు ఎన్.సుధీర్ బాబు,జి. శ్రీనివాస్, నగరపాలక సంస్థ కమీషనరు ఎస్. వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర -భీమవరం: సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ జిల్లా ఖజానా కార్యాలయంలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటుచేసిన బొమ్మల కొలువును జిల్లా కలెక్టర్ ప్రశాంతి ప్రారంభించి ఖజానా కార్యాలయ సిబ్బందికి శుభాకాంక్షలు

తెలిపారు. సంక్రాంతి సంబరాలు సాంప్రదాయం ఉట్టిపడేలా వేడుకగా జిల్లా ట్రెజరీ అధికారి ఆదారి గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించడాన్ని ప్రశంసించారు. కోలం ముగ్గులను, బొమ్మల కొలువును అలంకరణలను పరిశీలించి చాలా బాగుందని కితాబు ఇచ్చి, ఈ అలంకరణలో పాల్గొన్న మహిళా సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగువారి అతి పెద్ద పండుగ సంక్రాంతి అని, కుటుంబ సభ్యులందరూ పండగ రోజుల్లో ఒక చోట చేరి ఆనందోత్సహాలతో సాంప్రదాయబద్ధంగా జరుపుకునే పండుగ సంక్రాంతి అన్నారు. ఈ వేడుకలలో జిల్లా ట్రెజరీ అధికారి ఆదారి గణేష్, సహాయ ట్రెజరీ అధికారి అబ్దుల్ హకీం, ఎస్ టి ఓలు జె. రామారావు, ఇ.హిమబిందు, ఎ.రవివర్మ, పి.హరిబాబు, ఎ.వి. శివాజీ, ట్రెజరీ అసోసియేషన్ అధ్యక్షులు యు.వి.పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మాధవ నాయుడు పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-నరసాపురం: మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు పుట్టిన రోజు వేడుకలు స్థానిక రాయిపేట కార్యాల యంలో అభిమానులు, తెదేపా కుటుంబ సభ్యులు, వివిధ

పార్టీల నాయకులు, ప్రముఖులు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మందికి పైగా రక్తదానం చేశారు. తెలుగు సంప్రదాయాలకు అద్దం పడుతూ కోలాట నృత్యాలు, గంగిరెడ్లు, సన్నాయి మేళాతాళాలతో జన్మదిన వేడుకలను అట్టహాసంగా జరిగాయి.తెలుగు సంప్రదాయాలకు అద్దం పడుతూ కోలాట నృత్యాలు, గంగిరెడ్లు, సన్నాయి మేళాతాళాల తో జన్మదిన వేడుక లను అట్టహాసంగా జరిగాయి.

సిఆర్ఆర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-ఏలూరు: సర్ సి.ఆర్. రెడ్డి అటానమస్ కళాశాల క్రీడా ప్రాంగణంలో 'సంక్రాంతి సంబరాలు'ను విద్యాసంస్థల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.వి. బాలకృష్ణా రావు భోగి మంటలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మన తెలుగువారి సంస్కృతి

సంప్రదాయాలను తెలియజేయాలనే ఉద్దే శ్యంతో ఈ కార్యక్ర మాన్ని ఏర్పాటుచేశామన్నారు. చిన్నారులకు భోగిపండ్లు, భోగి మంటలు, బొమ్మల కొలువు, గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసు కీర్తనలు, రంగోళి, మెహందీ, హెూంఫుడ్, గాలిపటాలు, సంప్రదాయ వస్త్రధారణ, జానపద, శాస్త్రీయ నృత్యాలు మొదలైనవి నిర్వహించడం ద్వారా తమ పాత రోజులు జ్ఞాపకం చేశాయన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలు హిందువులకు అతి పెద్ద పండుగైన సంక్రాంతి పండుగ ద్వారా కల్పిస్తాయని వాటి స్ఫూర్తిని మనం గుర్తించుకోవాల న్నారు. ఈ పోటీలలో సర్ సి.ఆర్. రెడ్డి విద్యాసంస్థల నుండి అనేకమంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో విజేత లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఇన్‌చార్జి సెక్రటరీకిలారు ప్రభాకరరావుగారు, కోశాధికారి చిట్టూరి జానకి రామయ్య, అటానమస్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.ఎస్.విష్ణుమోహన్, పీ.జీ. కోర్సెస్ కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, ఉమెన్స్ కళాశాల కరస్పాండెంట్ పాలడుగు శ్రీరంగం, ఆడిటర్ సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఎ. రామరాజు, అధ్యాపక, అధ్యాపకేతర విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

12 నుంచి ఫిబ్రవరి 29 వరకు తాడేపల్లిగూడెంలో ధర్మ ప్రచార మహోత్సవాలు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ముఖ్యమంత్రి జగన్ సంకల్పంతో దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ధర్మ ప్రచారంలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో ఈ నెల12వ తేదీ నుంచి ఫిబ్రవరి 29వ తేదీ వరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహణలో ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధర్మ ప్రచార మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. స్థానిక శ్రీబలుసులమ్మ అమ్మ వారి కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో ఆయన దీనికి సంబంధించిన వివరాలను తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్‌కు సమీపంలోని శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం, శ్రీ బలుసులమ్మ కళ్యాణ మండపాలకు మధ్య గల విశాలమైన ఖాళీ స్థలంలో ఈ పూజలు నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంకల్పంతో గత ఏడాది మే 7 నుంచి 23వ తేదీ వరకు విజయవాడలో మహా యజ్ఞం నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి ఆశీస్సులతో రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ ధర్మ ప్రచారాన్ని చేపట్టిందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో అర్చక అకాడమీ డైరెక్టర్, ప్రఖ్యాత వేద పండితులు వేదాంతం రాజగోపాల చక్రవర్తి, సిజిఎఫ్ కమిటీ మెంబర్ కర్రి భాస్కర్ రావు, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు చెన్నా జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

లివింగ్ శాక్రిప్రైజ్ సేవలు అనిర్వచనీయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రజా దాహార్తిని తీర్చడం కోసం కొయ్యలగూడెం" లివింగ్ శక్రిప్రైస్" సంస్థ ద్వారా మంచి నీటి బోర్లు, మంచినీటి ట్యాంకులు నిర్మించడం హర్షించదగ్గ విషయమని పరింపూడి

గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి పేర్కొన్నారు. గ్రామంలో మంచినీటి కొరత ఎక్కువగా ఉన్నదని లివింగ్ శక్రి ప్రైస్ సంస్థ వారికి సర్పంచ్ విజయ కుమారి విన్నవించగా ఆమె అభ్యర్థన మేరకు మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో మత్స్యకారుల కాలనీలో లివింగ్ శక్రి ప్రైస్ సంస్థ ద్వారా మూడు లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన బోరు, మంచినీటి ట్యాంకును ఎల్ ఎస్ ఎం సంస్థ ట్రెజరర్ ఎం.ప్రేమకుమారి, సర్పంచ్ విజయ కుమారి, ఎంపీటీసీ సభ్యుడు గంట శ్రీనివాసరావు చేతులమీదుగా ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి చినబాబు, మత్స్యశాఖ డైరెక్టర్ తాతపూడి గుబ్బాలు, సంస్థ సభ్యులు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్నగూడెంలో ఆలయ నిర్మాణం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం ఎర్నగూడెంలో దేవరపల్లి కి చెందిన శ్రీకాకుళపు వెంకట నరసింహారావు సుశీల దంపతుల కుమారుడు శ్రీకాకుళపు కాశీ విశ్వనాథం రోహిణి దంపతులు కోటి రూపాయల

వ్యయంతో ఆలయం నిర్మాణానికి 2022 ఫిబ్రవరి 11వ తేదీన శంకుస్థాపన చేయించారు. అప్పటి నుండి ఆలయ నిర్మాణం కొనసాగుతున్నది శాస్త్రోక్తంగా పెద్ద తిరుపతిలో జరిగే విధంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని దాత శ్రీకాకుళపు కాశీ విశ్వనాథం తెలిపారు .ఆలయ నిర్మాణ పనులు నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు. తనకు ఎర్నగూడెంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణం చేపట్టాలని తలంపు కలిగిందని దీనికి దైవం కూడా తోడు కావడంతో ఆలయ నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఉరి శరణ్యమని దేవరపల్లి మండల అంగన్‌వాడీలు పేర్కొన్నారు దేవరపల్లిలో గత 31 రోజుల నుండి నిరాహార దీక్ష చేస్తున్న

అంగన్వాడీల వ్యవస్థను దీక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించడంలో జాప్యం చేస్తుందని విమర్శించారు అంగన్వాడీలు బాలింతలకు గర్భిణీలకు చిన్న పిల్లలకు ఎన్నో సేవలు చేస్తున్నారని వారి సేవలకు ప్రతిఫలం సరిగ్గా లభించడం లేదని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా అంగన్వాడీలు ఉరి తాళ్ళను బిగించి తమ నిరసన తెలియజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి సంఘం నేతలు ఏ పద్మ కామేశ్వరి కే వరలక్ష్మి కే దేవి సావిత్రి కే కుమారి డివిడి లక్ష్మి ఉండవెల్లి మంగతాయారు, సిఐటియు నాయకుడు కే రత్నాజీ, ఎస్.భగత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదు

విశాలాంధ్ర - గోపాలపురం : ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయడం సహేతుకం కాదని గోపాలపురం ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎ. జాన్ బాబు అన్నారు. మండలం లోని సర్వ శిక్ష అభియాన్ పరిధిలో

పనిచేస్తున్న 12 మంది ఎస్ ఎక్స్ ట్రాక్టర్లకు గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కుటుంబ పోషణ భారమవుతున్న తరుణంలో ముఖ్యమంత్రి చొరవ తీసుకొని సమ్మె చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి జీతాలు చెల్లించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కే. శ్రీనివాసరావు, ఎం. నాగేశ్వరరావు, ఎస్.రాజశేఖర్, బోడా వెంకటలక్ష్మి, సిహెచ్ తాతారావు, జి. వెంకటేశ్వరరావు, ఎస్.కె రహమతుల్లా జి. ప్రసన్నకుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఎస్మా చట్టాన్ని ఎత్తివేయాలి

విశాలాంధ్ర - ఉండ్రాజవరం:గత నెల రోజులుగా తమ న్యాయపరమైన డిమాండ్ల సాధనకు సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఎస్మా చట్టాన్ని రద్దు చేసేంత వరకు, అంగన్వాడీలు అదిరేది, బెదిరేది లేదని

తూర్పుగోదావరి జిల్లా, పెరవలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గత నెల రోజులుగా ఉండ్రాజవరం మండలం తహసిల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న అంగన్వాడీల సమ్మె శిబిరం వద్ద గురువారం ఆయన వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ రంగనాయకమ్మ, ఎం జానకి. పి వి ఎస్ ఎస్ లక్ష్మి, విజయ కుమారి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు గెలుపే ధ్యేయంగా ఆడాలి

విశాలాంధ్ర - గోపాలపురం : క్రీడాకారులు గెలుపే ధ్యేయంగా ఆడాలని కొవ్వూరు డిఎస్పి వి ఎస్ ఎన్ వర్మ తెలిపారు. మండలంలోని వేల చింతలగూడెం గ్రామంలో గత ఎనిమిది రోజులుగా ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు బుధవారం తో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్లో

సాయిరాం కింగ్స్ పై రాజమహేంద్ర వరం లెజెండ్స్ టీం 14 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. డీసీఎంఎస్ ఆవరణలో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ ఫైనల్ పోటీల్లో కృష్ణా జిల్లాకు చెందిన విజేత జట్టుకు, ద్వితీయ స్థానం ప్రకాశం జిల్లా జట్లు సాధించాయి. క్రికెట్, వాలీబాల్ పోటీలలో విజేతలైన మహిళ జట్లకు ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన నగదు పురస్కారాన్ని మెమొంటోను డిఎస్పి వర్మ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకటరాజు, దేవరపల్లి సిఐ కె. రామకృష్ణ చేతులమీదుగా బహుమతులు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ ఎం ఫౌండేషన్ చైర్మన్ గంటా మధు కృష్ణ, పెన్విర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ తామస్ ఫిలిప్స్ ఎస్ ఐ కే సతీష్ కుమార్, కొర్లపాటి రాము, పిన్నమనేని చినబాబు, గోపాలకృష్ణ క్రీడాకారులు పాల్గొన్నారు.

రిజర్వుడు స్థానాల్లో రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్‌లకు టిక్కెట్లు ఇవ్వొద్దు

విశాలాంధ్ర - అమలాపురం : ముప్పై ఐదేళ్లు ఐఏఎస్‌లుగా కోట్లు సంపాది స్తున్న. ఐఏఎస్‌లు రిటైర్ కాగానే మరోసారి ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో పోటీ చేసి చట్ట సభలకు ఎన్నిక అవుతున్నారని సీనియర్ న్యాయవాది టిడిపి నాయకుడు నాగాబత్తుల శ్రీనివాసరావు విమర్శించారు. అటు ఉద్యోగాలలో రిజర్వేషన్లు పొంది రిటైర్మెంట్ కాగానే సంపాదించిన కోట్లతో రిజర్వుడు నియోజకవర్గాల్లో పదవులకు పోటీ చేసి రెండు రిజర్వేషన్లు పొందుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేఖరుల

సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల్లో ఏళ్ల తరబడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు ఎదుగుదల లేకుండా ఉండిపోతున్నారని నాగాబత్తుల ఆవేదన చెందారు. రాజకీయ పార్టీలు కూడా ఐఏఎస్‌లకు పార్టీ టిక్కెట్లు ఇవ్వకుండా పక్కన పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై అందరూ కలసి రావాలని కోరారు. దీనిపై న్యాయపోరాటం చేస్తానని ఆయన హెచ్చరించారు. తాను తెలుగుదేశం పార్టీలో తన గురువు డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆధ్వర్యంలో పార్టీలో పనిచేస్తున్నానని చెప్పారు. తమకు ఎమ్మెల్యే స్థానానికి అవకాశం కల్పించాలని నాగాబత్తుల కోరారు.

అక్షరలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేట అక్షర విద్యా సంస్థల్లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతిని పురస్కరించుకుని విద్యార్థిని, విద్యార్థులు సాంప్రదాయ బొమ్మలను తయారు చేశారు. వాటిని జగ్గంపేట పోలీసు స్టేషన్ సిబ్బందికి, అగ్నిమాపక కార్యాలయ సిబ్బందికి అందజేసి శు

భాకాంక్షలు తెలిపారు. అనంతరం స్కూల్ ఆవరణలో విద్యార్థులు రంగవల్లులను అందంగా అలంకరించారు. సాంప్రదాయ వేషధారణలతో చిన్నారులు అలరించారు. భోగి మంటలు వేసి, సంక్రాంతి వేడుకలను విద్యా సంస్థల చైర్మన్ పాఠంశెట్టి సతీష్, కరస్పాండెంట్ ఆళ్ల రవి కిషోర్ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధికి కృషి చేసింది టీడీపీనే

విశాలాంధ్ర - గోపాలపురం : బీసీల సమగ్రాభివృద్ధికి విశేష కృషి చేసింది తెలుగుదేశం పార్టీయేనని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. గురువారం మండలంలోని వాదాలకుంట గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కాకర్ల శ్రీరామ్ అధ్యక్షతన తెదెపా నాయకుల జయహెూ బీసీ

సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ సందర్భంగా మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అరాచక పాలన చేస్తున్నారని, హత్యలు ప్రశ్నించే వారిపై కేసులు బనాయించి జైలుపాలు చేస్తూ క్రూరంగా హింసిస్తున్నారని దుయ్యబట్టారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు రానున్నాయని కార్యకర్త, నాయకుడు సమిష్టిగా కృషిచేసి తెలుగుదేశం పార్టీని అఖండ మెజార్టీతో అధికారులకు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మీరా, రాష్ట్ర మహిళా కార్యదర్శి మజ్జి పద్మావతి, జోన్ 2 కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస్, పార్లమెంటు మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉమర్, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రొంగల సత్యనారాయణ, వడ్లమూడి రమేష్, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కాకర్ల రామ తులసి, జేష్ఠ శ్రీనివాసరావు, ఎంట్ర ప్రగడ మంగారావు, గెడా జగ్గారావు, బీసీ సంఘాల నాయకులు హాజరయ్యారు.

జంట కవులు నల్లా, బివివిలకు సన్మానం

విశాలాంధ్ర - అమలాపురం : కోనసీమలో మూడు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి, కళా రంగాలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏలూరులో పాత బస్టాండ్ సమీపంలోని వైఎంహెచ్ఎం హాల్లో గురువారం నిర్వహించిన సాహిత్య సంక్రాంతి సంబరాల్లో 150

మంది కవులతో నిర్వహించిన కవి సమ్మేళనంలో అమలాపురం పట్టణానికి చెందిన జంట కవులు శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి, జిల్లా కన్వీనర్ బివివి సత్యనారాయణలను రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్పర్సన్ పిల్లంగోళ్ళశ్రీలక్ష్మి, మహాకవి బోయ భీమన్న సతీమణి బోయిహైమావతి ఘనంగా సన్మానించారు. పండిత శాలువతో, 5000 రూపాయలు నగదుతో, జ్ఞాపకతో వారిద్దరి ప్రతిభను గుర్తించి సన్మానించారు. సన్మానం పొందిన జంటకవులను శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు అభినందించారు.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : పట్టణంలో ప్రత్తిపాడు నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కేంద్ర

మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్ళంరాజు విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా పళ్ళంరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏపీకి ప్రత్యేక హెూదా తీసుకురావడంతో పాటు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిలుకోటి పాండురంగారావు, కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జి ఎం. శ్రీరామచంద్రమూర్తి, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ పెద్దాడ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర - రాజానగరం: మండలంలో నరేంద్రపురం గ్రామానికి చెందిన గుత్తల కృష్ణవేణిపై జనవరి 3న హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఐఎఫ్టియు, ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో గురువారం రాజానగరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన గుత్తల కృష్ణవేణి అనే ఒంటరి మహిళ

కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుందని, ఈ నెల 3వ తేది రాత్రి 10 గంటల సమయంలో గ్రామానికి చెందిన పెంకే దుర్గారావు అనే వ్యక్తితో పాటుగా అతని కుటుంబ సభ్యులు కొంతమంది బ్లేడ్ బ్యాచ్, గుండాలను తీసుకొచ్చి తీవ్రంగా దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. అరుపులు, కేకలు వేయడంతో ఇరుగు పొరుగువారు వచ్చి నన్ను విడిపించారని. పోలీసులకు ఫోన్ చేయడంతో తప్పించుకుని పారిపోయారన్నారు. బాధితురాలు కృష్ణవేణిని రాజానగరం పోలీసులు చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించార న్నారు. అయితే బాధ్యులపై ఇప్పటి వరకు ఏవిధమైన చర్యలు తీసుకోలేదన్నారు.తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్ పవన్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎస్ జిల్లా అధ్యక్షుడు భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం.

విశాలాంధ్ర - ఉండ్రాజవరం:వార్షిక మరమ్మతులు, చెట్లు తొలగించుట తదితర కారణాలుగా శుక్రవారం మండలంలోని పాలంగి, మోర్త, వేలివెన్ను సబ్ స్టేషన్ పరిధిలో ఉ.8:00 నుండి మ. 2:00 వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయము కలుగుతుందని ఏ పి ఈ పి డి సి ఎల్, నిడదవోలు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బి వీరభద్రరావు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఉండ్రాజవరం, పాలంగి, కే సావరం, చివటం, తాడిపర్రు, వెలగదుర్రు, మోర్త, చిలకపాడు, దమ్మెన్ను, వేలివెన్ను, కాల్దారి గ్రామాల వ్యవసాయ, వాణిజ్య, ఇతర వినియోగదారులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు. వ్యవసాయ ఫీడర్ల కు 3 పీహెచ్ సరఫరా వేళలు ఉదయం: 5:00 నుండి 8:00 వరకు, మధ్యాహ్నం 2:00 తరువాత సరఫరా ఇచ్చే విధముగా మార్పు చేసినట్లు తెలిపారు